సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 12 । ఆగస్టు । 2023



అందుబాటులోకి 'ఆన్‌లైన్'

శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం కాటేజీలు, వసతి గదుల సముదాయాలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవచ్చు. 10లో



డెంగీతో ఇద్దరు మృతి

అశ్వాపురం మండలం చింతర్యాలకాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు డెంగీ జ్వరంతో శుక్రవారం మృతి చెందారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వనమా దంపతులు

పాల్వంచ రూరల్: శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి పంచామృతాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు అమ్మవారి జన్మస్థలం వద్ద పూజలు జరిపారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మహిపతి రామలింగం, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, చింతా నాగరాజు, బండి చిన్న వెంకటేశ్వర్లు, గంధం వెంగళరావు, కాటారపు లక్ష్మీనారాయణ, సంకా వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ పోస్టుల భర్తీకి సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను శుక్రవారం విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. గత జూలై 23, 24 తేదీల్లో జరిగిన ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. కొత్తగూడెంలోని బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యర్థుల ధ్రువీకరణపత్రాలను పరిశీలించారు. మొత్తం 76 పోస్టులు ఉండగా, 228 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు అన్నమని, సైదులు, సతీష్‌కుమార్, ఏసీజీ ఇ.మాధవరావు, జ్యోతి, సునీల్, మోహన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'భారజల' ఎన్నికలు



కర్మాగారం వద్ద ప్రచార సందడి

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. కర్మాగారంలోని క్యాంటీన్–1లో ఎన్నికలు నిర్వహించారు. తొమ్మిది ఆఫీస్ బేరర్ పోస్టులకు 24 మంది పోటీ చేశారు. మొత్తం 570 మంది ఓటర్లు ఉండగా, 481 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారిగా మోహన్‌కుమార్ వ్యవహరించారు. శనివారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ ఒక కూటమిగా, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీఆర్‌టీయూ మరో కూటమిగా పోటీ చేశారు.

మూడు రోజులపాటు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ విభాగం పర్యవేక్షకుడు ఎం.సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడిందని తెలిపారు. దీంతో పశ్చిమ, వాయవ్య దిశ నుంచి గాలులు తెలంగాణ వైపునకు వీస్తున్నాయని, ఈ ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు.

'మద్యం' దరఖాస్తులు 122

కొత్తగూడెంఅర్బన్: నూతన మద్యం దుకాణాల కోసం శుక్రవారం 122 దరఖాస్తులు దాఖలయ్యాయని జిల్లా ఆబ్కారీ అధికారి జానయ్య తెలిపారు. అనంతరం జిల్లా ఆబ్కారీ కార్యాలయంలో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో నూతన మద్యం పాలసీపై అవగాహన కల్పించారు. 12న రెండో శనివారం అయినప్పటికీ దరఖాస్తులు స్వీకరిస్తామని, 13, 15వ తేదీల్లో సెలవులు ఉన్నాయని, చివరి రోజు 18న సాయంత్రం 6 గంటలవరకు దరఖాస్తులు తీసుకుంటామని వివరించారు. ఇప్పటివరకు మొత్తం 223 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

జీసీసీ బాగయ్యేనా?

అవినీతి, అక్రమాలతో మసకబారుతున్న ప్రతిష్ట

- అధికారులు, ఉద్యోగుల్లో లోపిస్తున్న జవాబుదారీతనం
- ముందుకు సాగని పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు ప్రక్రియ
- నూతన పీఓ చొరవ చూపాలని గిరిజనుల విన్నపాలు



భద్రాచలంలోని జీసీసీ కార్యాలయం

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) అవినీతి అక్రమాలతో అభాసుపాలవుతోంది. అధికారులు, ఉద్యోగుల్లో జవాబుదారీతనం పూర్తిగా కొరవడింది. ములకలపల్లి పెట్రోల్ బంక్‌లో రూ. 50 లక్షలు గోల్‌మాల్, అశ్వారావుపేట మండలం నారాయణపురం, పాల్వంచ గోదాంలలో సుమారు రూ. 80 లక్షల విలువైన ఉత్పత్తులు మాయం వంటి స్కాంలు గతేడాది చోటుచేసుకున్నాయి. అటవీ ఫలసాయం క్రయవిక్రయాలతో గిరిజనులకు అండగా నిలుస్తున్న జీసీసీ మారిన పరిస్థితులకు అనుగుణంగా చేపట్టిన పలు ప్రాజెక్టులతో లాభాలు గడిస్తోంది. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, ఉద్యోగులలో జవాబుదారీతనం లోపించటంతో భద్రాచలం జీసీసీ కార్యాలయం అవినీతికి చిరునామాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అవినీతి సొమ్ము రికవరీ ఏదీ..?

భద్రాచలం జీసీసీ కార్యాలయంలో పరిధిలో 2021–22 ఏడాదిలో రూ.105 కోట్ల లక్ష్యం నిర్దేశించగా, రూ.129 కోట్ల ఆదాయం వచ్చింది. 2022–23లో రూ.165 కోట్ల లక్ష్యం నిర్దేశించగా, దీనిని సైతం సాధించే ప్రయత్నంలో ఉంది. లాభాలు గడిస్తున్నా అవినీతి అక్రమాలతో సంస్థ ప్రతిష్ట మసకబారుతోంది. ములకలపల్లి మండలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయగా, అనతి కాలంలోనే లాభాలు వచ్చాయి. పది మంది గిరిజనులు ఉపాధి పొందారు. లొసుగులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇద్దరు ఉద్యోగులు రూ.32 లక్షలను స్వాహా చేసినట్లు ఐటీడీఏ లెక్కలు చెబుతున్నాయి. అనధికారకంగా రూ.50 లక్షలకు పైగానే కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏడాది క్రితం అశ్వారావుపేట, పాల్వంచ గోదాంలలో నిల్వ చేసిన 1,147 క్వింటాళ్ల ముష్టిగింజలను సిబ్బంది విక్రయించి సుమారు రూ.80 లక్షలు మింగేశారు. అవినీతి ఉద్యోగులను గుర్తించినా ఉన్నతాధికారులు సస్పెన్షన్, బదిలీల వంటి చర్యలకే పరిమితమయ్యారు. పై రెండు ఘటనల్లో స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయలేదు. వీటికితోడు అంతర్గతంగా ఇంకా అవినీతి జరుగుతోందనే ఆరోపణలు కూడా లేకపోలేదు.

పెట్రోల్ బంక్‌ల ఏర్పాటులో జాప్యం

జీసీసీకి ప్రస్తుతం పెట్రోల్ బంకులు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కూడా దొరుకుతోంది. తొలుత గుండాల, ములకలపల్లి మండల కేంద్రాల్లో 2018 నవంబర్‌లో బంక్‌లు ప్రారంభించగా, అద్భుత ఫలితాలు వచ్చాయి. దీంతో అప్పటి ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు చొరవతో భద్రాచలం, పాల్వంచ, దమ్మపేట, చిన్నబండిరేవు, వినాయకపురం(అశ్వారావుపేట మండలం), మణుగూరు, జానంపేట, ఇల్లెందు, గార్ల బయ్యారం, జూలూరుపాడులలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిలో కొన్నింటి పనులు మాత్రమే నడుస్తున్నాయి. కొన్నిచోట్ల భూ సేకరణ సమస్యలు, మరికొన్ని చోట్ల అనుమతుల జాప్యంతో ముందుకు సాగటం లేదు. ప్రధానంగా సుమారు 80 వేల జనాభా, చుట్టుపక్కల ప్రాంతాలు, రామాలయానికి వచ్చే భక్తులతో రద్దీగా ఉండే భద్రాచలంలో ఇప్పటివరకు బంక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయలేదు. కలెక్టర్ ఇచ్చిన నిరభ్యంతర పత్రం కాలవ్యవధి కూడా ముగిసిపోయింది. దీంతో మళ్లీ కలెక్టర్‌కు మళ్లీ దరఖాస్తు పంపాల్సి వచ్చింది. పెట్రోల్ బంక్‌కు అనువైన స్థలం జీసీసీ ప్రాంగణంలోనే ఉన్నా.. బంక్ ఏర్పాటు కాకుండా కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త సార్ దృష్టి సారించేనా..?

భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ప్రతీక్ జైన్ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్పందించి జీసీసీని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. స్వాహా సొమ్ము రికవరీతోపాటు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలని విన్నవిస్తున్నారు. సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి కేటీఆర్ ఆర్థికసాయం

ఇల్లెందు జెడ్పీటీసీ కుటుంబానికి రూ.9 లక్షలు అందజేత



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, జెడ్పీటీసీ ఉమాదేవి కుటుంబం

ఇల్లెందురూరల్: ఇల్లెందు జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి కుటుంబానికి రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం చేయూతనందించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జెడ్పీటీసీ భర్త హరిలాల్ మూడేళ్ల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆ బాధను దిగమింగుకుంటూ ఉమాదేవి తన ఇద్దరు పిల్లలను చదివించుకుంటోంది. పెద్దకుమార్తె యువతేజశ్రీ డిగ్రీ, రెండో కుమార్తె పవనీషా ఇంటర్ చదువుతున్నారు. భర్త ఉద్యోగాన్ని వారసత్వంగా తన పిల్లలకు ఇప్పించాలని కోరుతూ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియతో కలిసి శుక్రవారం ఆమె మంత్రి కేటీఆర్‌ను కలిశారు. జెడ్పీటీసీ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి కేటీఆర్ పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. పిల్లల భవిష్యత్తు చదువుకు వినియోగించుకోవాలని సూచిస్తూ రూ.9 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

108, 102 వాహనాలను వినియోగించుకోవాలి

గుండాల: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు 108, 102 అంబులెన్స్ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ భూమా నాగేందర్ సూచించారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఉన్న 108, 102 వాహనాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఆక్సిజన్ నిల్వ ఉండేలా చూసుకోవాలని సూచించారు. సత్వరమే గమ్యస్థానం చేరడం కోసం జీపీఎస్ మ్యాపింగ్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణుల పరీక్షలు, స్కానింగ్, చిన్న పిల్లల వ్యాక్సిన్ కోసం 102 వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మధుకర్ రెడ్డి, ప్రవీణ్, సునీల్, ప్రశాంతి, భాగ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డీఓ



పోలింగ్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న భద్రాచలం నూతన ఆర్‌డీఓ మంగీలాల్

భద్రాచలం: భద్రాచలం నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిగా మంగీలాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. ఇప్పటివరకు ఆర్డీఓగా పనిచేసిన మాధవిని మంగీలాల్ స్థానంలో నియమించారు. బదిలీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి వచ్చిన మాధవి 20 రోజుల క్రితమే ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆమెను మళ్లీ బదిలీ చేశారు. ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించాక మంగీలాల్ భద్రాచలంలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు వస్తున్నందున పోలింగ్ బూత్‌లలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. దివ్యాంగుల కోసం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కరెంటు, తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ బుద్దా నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న భానుమతి

సుజాతనగర్: రైతులు వ్యవసాయ చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సూచించారు. శుక్రవారం శ్రీనిధి పాఠశాల ఆవరణలో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లోని భూములపై ఉన్న హక్కులకు భంగం కలగకుండా ఉండాలంటే పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.రమాదేవి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రావిలాల రామారావు, జాయింట్ సెక్రెటరీ కాసాని రమేష్, డిప్యూటీ లీగల్ కౌన్సిల్ నిరంజన్‌రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి, ఎస్సై సోమేశ్వర్, న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీ

మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా 'ఇంద్రధనుష్'

- గవదబిళ్లలు, రుబెల్లా నివారణకు చర్యలు
- ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులకు టీకాలు
- నేటితో ముగియనున్న మొదటి విడత వ్యాక్సినేషన్



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

భద్రాచలంఅర్బన్: ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వివిధ కారణాలతో యాంటీ వైరస్ ఇంజెక్షన్ (టీకా) వేయించుకోలేకపోయిన వారిని గవదబిళ్లలు, రుబెల్లా వైరస్ నుంచి రక్షించేందుకు మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని చేపట్టింది. వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి టీకాలు వేయించుకుని వారిని గుర్తించి మూడు విడతల్లో వ్యాక్సిన్ వేయనున్నారు.

మూడు విడతలుగా..

ఈ నెల 7వ తేదీ నుంచి 12 వరకు మొదటి విడతగా, సెప్టెంబరు 11 నుంచి 16 వరకు రెండో విడతగా, అక్టోబర్ 9 నుంచి 14వ తేదీవరకు మూడో విడతగా వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నారు. రెండేళ్లలోపు పిల్లలకు, 2–5 ఏళ్లలోపు పిల్లలకు బూస్టర్ డోస్ వేస్తారు. ఇప్పటికే ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో టీకాలు వేస్తుండగా, మొదటి విడత వ్యాక్సినేషన్ శనివారంతో ముగియనుంది.

1291 మందికి టీకాలు

జిల్లాలోని 29 పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటివరకు 1,291 మంది టీకాలు వేయించుకోగా.. వీరిలో 222 మంది గర్భిణులు, ఏడాది లోపు పిల్లలు 590, ఒకటి నుంచి రెండేళ్ల వయసు పిల్లలు 232 , రెండు నుంచి ఐదేళ్ల పిల్లలు 247 మంది ఉన్నారు. సర్వేలో గుర్తించిన వారి సంఖ్య కంటే వ్యాక్సిన్ కోసం వస్తున్న వారి సంఖ్య కొంత ఎక్కువగానే ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఈ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటుగా వ్యాక్సిన్ వేయించుకుంటే రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. వ్యాక్సిన్లు సురక్షితమైనవని, నాణ్యమైనవనీ, వీటిగురించి భయపడనవసరం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. వ్యాక్సిన్లతో పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరిగి ప్రమాదకరమైన జబ్బుల బారిన పడకుండా ఉంటారని పేర్కొంటున్నారు.

విజయవంతంగా వ్యాక్సినేషన్



మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి టీకా వేయించుకోనివారి జాబితా తయారు చేశారు. సర్వే పకడ్బందీగా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బాలాజీ నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

తప్పక టీకాలు వేయించాలి



తల్లీ పిల్లలకు సమయానికి రోగనిరోధక టీకాలు వేయించాలి. నిర్దిష్ట సమయంలో నిర్ణీత వ్యాక్సిన్ వేయించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదగుతారు. ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

–డాక్టర్ జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

పనులు వేగవంతం చేస్తాం

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్ కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.10.25 కోట్లతో 24 పనులు చేపట్టినట్లు తెలిపారు. వీటిలో నాలుగు పనులు పూర్తయ్యాయని, కొన్ని పనులు పురోగతిలో ఉన్నాయని, మరికొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో హోంగార్డులుగా పనిచేసి విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుల కుటుంబాలు కలవగా, వారి యోగక్షేమాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవసరం ఉన్న అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ (ఏఆర్)ఈ. విజయ్‌బాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు (హోంగార్డ్స్) ఓ.సుధాకర్‌రావు, జిల్లా హోంగార్డ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎడతెగని జాప్యం

- నత్తనడకన రెండో విడత గొర్రెల పంపిణీ
- లక్ష్యం 3,487 యూనిట్లు.. గ్రౌండింగ్ 93 యూనిట్లే..
- వాటా ధనం చెల్లించి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



గొర్రెలతో లబ్ధిదారుడు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. మొదటి విడత 2017–18 సంవత్సరంలో ప్రారంభమై 2028–19లో ముగిసింది. రెండో విడత కోసం నాలుగేళ్లపాటు లబ్ధిదారులు ఎదురుచూశారు. గత వేసవిలో రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పంపిణీ మందగమనంగా సాగుతోంది. రెండు విడతలు కలిపి జిల్లాకు 11,060 యూనిట్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో 7,511 మంది లబ్ధిపొందారు. రెండో విడతలో 3,487 యూనిట్లు మంజూరుకాగా ఇప్పటివరకు కేవలం 93 యూనిట్లే గ్రౌండింగ్ చేశారు. గతంలో మొదటి విడత పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అక్రమాలు జరిగాయనే విమర్శలు రాగా ఈసారి పారదర్శకంగా పంపిణీ చేయాలని మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశారు. మండల కమిటీలకు జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. వేసవి కాలంలో గొర్రెలు ఎండతీవ్రతకు మరణిస్తాయని, వేసవి తర్వాత పంపిణీ జరుగుతుందని అధికారులు పరోక్షంగా సంకేతాలు ఇవ్వడంతో లబ్ధిదారులు వేచి చూశారు. వర్షాకాలం వచ్చి రెండు నెలలవుతున్నా గొర్రెల పంపిణీ ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

ఇతర శాఖల అధికారులకు అవగాహన లేక..

గతంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో యూనిట్లు పంపిణీ చేశారు. ఆ శాఖకు స్పష్టమైన అవగాహన ఉండడంతో లబ్ధిదారులకు త్వరగా పంపిణీ జరిగేది. ప్రస్తుతం మండలస్థాయి కమిటీల్లో వివిధ శాఖల అధికారులతోపాటు, మండలానికి ప్రత్యేక అధికారిగా ఏదో ఒక శాఖకు చెందిన జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయా శాఖల అధికారులకు పశుసంవర్థక శాఖపై అవగాహన లేకపోవడంతో జాప్యం జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికితోడు జిల్లాలో ప్రధానంగా పోడు పట్టాలు, వరదలు తదితర కారణాలతో అధికారులంతా ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇది కూడా గొర్రెల పంపిణీకి ఆలస్యానికి కారణమైంది.

నిరాశలో లబ్ధిదారులు

భద్రాచలం నియోజకవర్గంలోని భద్రాచలంలో 6 యూనిట్లు, దుమ్ముగూడెం మండలంలో 6 , పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో 14, కొత్తగూడెం నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లిలో 11, పాల్వంచలో 12, ఇల్లెందు నియోజకవర్గంలోని ఇల్లెందు మండలంలో 11, టేకులపల్లిలో 12, అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేటలో 21 యూనిట్లు.. మొత్తం 93 యూనిట్లను మాత్రమే ఇప్పటివరకు లబ్ధిదారులకు అందించారు. కాగా జిల్లాకు 3,487 యూనిట్లు మంజూరైనా ఇప్పటివరకు 2,200 మంది మాత్రమే తమ వాటా ధనం చెల్లించారు. సంవత్సరం క్రితం చెల్లించినా ఇంకా గొర్రెలు ఇవ్వలేదని పలువురు లబ్ధిదారులు నిరాశకు లోనవుతున్నారు. పంపిణీ ప్రక్రియ వేగవంతమయ్యాక వాటా ధనం చెల్లిస్తామనే యోచనలో మరికొందరు ఉన్నారు.

ఆగస్టులోగా పూర్తి చేసేందుకు కృషి



పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టిన పనుల కారణంగా కొంత ఆలస్యమైంది. ఆగస్టు చివరి వరకు పంపిణీ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు నివేదిస్తున్నాం.

– బి పురంధర్, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి

సత్వరమే పూర్తి చేయాలి



ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు సత్వరమే గొర్రెల పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలి. గొర్రెలకు బదులు నగదు బ్యాంకులలో జమ చేస్తే లబ్ధిదారులు తమకు నచ్చిన గొర్రెలు కొనుగోలు చేసుకుంటారు. –కాసాని ఐలయ్య, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

భద్రాద్రివాసులకు ఆదర్శం 'గ్రీన్ భద్రాద్రి'



విద్యార్థినికి నగదు, పుస్తకాలు అందిస్తున్న ఏఎస్పీ పారితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి వాసులందరికీ 'గ్రీన్ భద్రాద్రి'ఎంతో ఆదర్శమని ఏఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. పట్టణంలోని చర్ల రోడ్‌లో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కనాటి ప్రసంగించారు. హరిత భద్రాద్రి సాధనే లక్ష్యంగా నిరంతరంగా మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తున్న గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కేయూ ఉమెన్స్ కళాశాలలో సీటు సంపాదించిన నిరుపేద పి.రమ్యకు రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ చేతుల మీదుగా అందించి 'గ్రీన్ భద్రాద్రి'సభ్యులు ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీరంగం సంపత్‌తోపాటు విష్ణు, సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, భూపతిరావు, నాగసూర్యనారాయణ, కృష్ణార్జున్‌రావు, వెంకటరెడ్డి, ఉమాశంకర్‌నాయుడు, రవికుమారి, తిరుమల్‌రావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, నాగభూషణం, తిలక్, కృష్ణ, శ్రీనివాసరాజు, ప్రసాద్, రాజు, సాంబయ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లిలో జెడ్పీ సీఈఓ పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న విద్యాలత

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి మండలంలో శుక్రవారం చుంచుపల్లి మండల ప్రత్యేకాధికారి (జెడ్పీ సీఈఓ) ఎం.విద్యాలత పర్యటించారు. డ్రైడై – ఫ్రైడేలో భాగంగా మండలంలోని ధన్‌బాద్ గ్రామ పంచాయతీ, ప్రశాంతినగర్, త్రీఇంక్‌లైన్‌లలో పర్యటించి నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో డ్రెయినేజీలు దెబ్బతిన్నడం వల్ల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ప్రతీరోజు ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మందా మంగమ్మ, గుంటి సత్యనారాయణ, ఉపేందర్, రఘు, బాషాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జిల్లాస్థాయి పాటల పోటీలు

పాల్వంచ: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాల్వంచ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్‌రావు, అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ సెంటర్‌లోని ఖాళీ స్థలంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాలవారీగా పాటల పోటీలు నిర్వహిస్తామని, విద్యార్థులు దేశభక్తి, అభ్యుదయ, జానపద గీతాలు పాడొచ్చని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 93993 24497లో సంప్రదించాలని కోరారు.

ఆగంతకులతో అప్రమత్తంగా ఉండాలి



వివరాలు తెలుసుకుంటున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: దొంగల విషయంలో ప్రజలు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని బస్టాండ్ ఏరియా, రైటర్‌బస్తీ, పోస్టాఫీస్ సెంటర్, హెడ్‌ఆఫీస్ ఏరియాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఎవరూ తమ ముఖ్య సమాచారం ఎవరికీ చెప్పొద్దని తెలిపారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకుడికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జూలూరుపాడు వికాస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ గాయపడ్డారు. శుక్రవారం ఉదయం రవికుమార్ బైక్‌పై టేకులపల్లి నుంచి జూలూరుపాడులోని కళాశాలకు వస్తున్నారు. ఈ క్రమంలో పడమటనర్సాపురంలో కుక్కలు పరుగెత్తుకుంటూ వచ్చి బైక్‌ను ఢీకొనడంతో రవికుమార్ రోడ్డుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో రవికుమార్‌కు రెండు చేతులు విరిగాయి. స్థానికులు రవికుమార్‌ను కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అందుబాటులోకి 'ఆన్‌లైన్'

- భద్రాద్రిలో వసతి కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ మరూ
- ప్రారంభించిన దేవాదాయ శాఖ కమిషనర్
- 16 నుంచి భక్తులకు అందుబాటులోకి..
- ఈఓ రమాదేవి కృషితో మెరుగైన సేవలు





త్వరలో అందుబాటులోకి రానున్న టీటీడీ సత్రం, (ఇన్‌సెట్) ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న కమిషనర్ అనిల్‌కుమార్, పక్కన ఈఓ రమాదేవి ఇతర ఉద్యోగులు

భద్రాచలం: భక్తులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వసతి గదులు, గృహాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఉన్న కాటేజీలు, వసతి గదుల సముదాయం, ధరలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో ఉండనున్నాయి. దీనికి సంబంధించి పోర్టల్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సేవలను భక్తులు వినియోగించుకోవాలని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, ఐటీ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఈఓ రమాదేవి ప్రత్యేక చొరవతో..

దేవస్థానం ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సేవలను భక్తులకు సులభతరం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా దేవస్థానంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషిచేశారు. తొలుత దేవస్థానంలో జరిగే పూజాది కార్యక్రమాలు, ఆర్జిత సేవలను ఆన్‌లైన్‌లో పెట్టారు. అందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించిన అనంతరం అధికారికంగా ప్రారంభించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఆర్జిత కార్యక్రమాలతో పాటుగా దేవస్థానం విశిష్టతను కూడా పొందుపర్చారు. వీటికి అనుసంధానంగా వసతిగృహాల వివరాలను కూడా పొందుపర్చడం వల్ల దూరప్రాంత భక్తులకు ఇబ్బంది ఉండదని భావించి ఆ ప్రక్రియను వేగవంతంగా చేపట్టి ప్రారంభించారు. హైదరాబాద్‌లో టెక్నికల్ సమస్యలు తలెత్తినా ఉన్నతాధికారులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ సేవలను పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. దేవస్థానం పరిధిలో ఉన్న వందశాతం గదులు ఇక భక్తులకు పూర్తిగా ఆన్‌లైన్‌లో లభిస్తాయి.

వసతిగదులు, కాటేజీలపై సైతం ప్రత్యేక దృష్టి

భద్రాచలంలో ప్రధానంగా భక్తులకు ఎదురయ్యే సమస్య వసతి. తక్కువ గదులు, కాటేజీలు ఉండటంతో ఈఓ రమాదేవి దీనిపై దృష్టి సారించారు. భక్తులకు అందుబాటులో ఉన్న శ్రీరామ నిలయాన్ని ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించటం, నిర్వహణలో తలెత్తిన లోపాలపై విచారణ జరిపి ఆ గదులను తిరిగి దేవస్థానం పరిధిలోకి తీసుకొచ్చారు. దేవస్థానంలో సీఆర్‌ఓ కార్యాలయం వద్ద జరిగే అవినీతి అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. ఉద్యోగులను అంతర్గత బదిలీ చేశారు. సీఆర్‌ఓ కార్యాలయం వెనుక టీటీడీ నూతనంగా నిర్మించిన వసతి గదులను త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనికి కావాల్సిన ఫర్నిచర్, ఇతర సామగ్రిని సమకూర్చాలంటూ టీటీడీ గత చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అధికారులను విజయవాడలో కలిశారు. దీంతో ఈ గదులు భక్తులకు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఇక రంగనాయకుల గుట్టపై ఉన్న పురాతన టీటీడీ గదులు ఎప్పటినుంచో శిథిలావస్థలో ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయించి భక్తులకు అందించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తంగా సుమారు 200 గదుల వరకు భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఈఓ రమాదేవి విశేష కృషి చేశారు.

సామాన్యులకు సేవలు అందిస్తాం..



భద్రాచలం వచ్చే సామాన్య భక్తులకు సైతం రామయ్య సేవలను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అందులో భాగంగానే ఆన్‌లైన్ టిక్కెట్లు, వసతి సేవలను తీసుకొచ్చాం. వసతి గదుల ఆన్‌లైన్ బుకింగ్ 16వ తేదీ నుంచి మొదలవుతుంది. ఇప్పటికే వసతి గదులు కొత్త వాటిని అందుబాటులోకి తీసుకొచ్చాం. అందుబాటులో ఉన్న స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూనే మెరుగ్గా సౌకర్యాలను కల్పించటానికి కృషి చేస్తాం.

–రమాదేవి, ఈఓ, రామాలయం

భద్రాచలం ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



చికిత్స అనంతరం భర్త, చిన్నారితో రుక్మిణి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచకు చెందిన యాసం రుక్మిణి రెండో కాన్పు కోసం గత నెల 29న పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరింది. సదరు మహిళకు ఆపరేషన్ ద్వారా కాన్పు చేశారు. అనంతరం మహిళకు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారటంతో ఆగస్టు 1న భద్రాచలం ఏరియాస్పత్రికి తరలించారు. రుక్మిణికి వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించినా సమస్యకు గల కారణం గుర్తించలేకపోయారు. చివరి ప్రయత్నంగా మరో పరీక్ష నిర్వహించగా రుక్మిణి పల్మనరి అంబాలిజం అనే ప్రాణాంతక సమస్యతో బాధపడుతున్నట్లుగా వైద్యులు గుర్తించారు. వెంటనే ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ అదే విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లగా భద్రాచలంలోనే ఆ మహిళకు వైద్యం అందించాలని సూచించారు. కాగా, స్థానిక పలువురు వైద్యులతో చర్చించి రుక్మిణికి వైద్యం అందించామని డాక్టర్ రామకృష్ణ తెలిపారు. రక్తం గడ్డకట్టినప్పుడు రక్తనాళాల గుండా ప్రయాణించి ఊపిరితిత్తుల దగ్గరకు చేరుకుని అక్కడ ఆగిపోయినప్పుడు ఈ వ్యాధి సంభవిస్తుందని, గడ్డ పెద్దగా లేదా ఎక్కువ గడ్డలు ఉంటే ప్రాణాంతకమవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు పంపించే అవకాశం లేనందున స్థానిక వైద్యులు సాయితేజారెడ్డి (కార్డియాలజిస్ట్ – కిమ్స్), రోశయ్య (మిమ్స్) సహకారంతో వైద్యం అందించామని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కిషన్, పల్మనాలజిస్ట్ జగదీశ్ రుక్మిణికి 24 గంటలూ అందుబాటులో ఉండి వైద్యం అందించారని చెప్పారు. కాగా, శుక్రవారం సూపరింటెండెంట్ రామకృష్ణను పలువురు శాలువాతో సత్కరించారు.

స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 15న సింగరేణి ఆధ్వర్యాన జరిగే స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను శుక్రవారం సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలకు సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ హాజరుకానున్న నేపథ్యాన ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా చూడాలన్నారు. అలాగే, పతాకావిష్కరణ, మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక ప్రదర్శనలపై సూచనలు చేశారు. ఆ తర్వాత ప్రకాశం స్టేడియంలో రూ.5లక్షల వ్యయంతో ఆధునికీకరించిన వాలీబాల్ కోర్టును డైరెక్టర్ బలరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు కట్టా బసవయ్య, సూర్యనారాయణ, అధికారులు కోడూరి శ్రీనివాస్‌రావు, రాజశేఖర్, రాజీవ్‌కుమార్, రవికుమార్, సుశీల్‌కుమార్, జీ.కే.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుగ్మతలపై అప్రమత్తం చేయాలి

డీఎంహెచ్‌ఓ శిరీష



లక్ష్మీపురంలో డ్రెయినేజీలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

బూర్గంపాడు: షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శిరీష సూచించారు. లక్ష్మీపురం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధులున్నవారి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. ఎన్‌సీడీ కిట్లు పరిశీలించి దాని గురించి రోగులకు వివరించారు. ప్రతీ నెల బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని, ఆహార నియమాలను పాటిస్తూ, చిన్నపాటి వ్యాయామం చేయాలని సూచించారు. మద్యం సేవించడం, పొగతాగటం, గుట్కాలు నమలటం పూర్తిగా మానేయాలని చెప్పారు. బీపీ, షుగర్‌కు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇచ్చే అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ మణికంఠారెడ్డి, సూపర్‌వైజర్ భద్రు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల బాధ్యత బీహెచ్‌ఈఎల్‌దే..

బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో నిర్మాణ పనులకు, ఈపీసీ పద్ధతిలో పనులు నిర్వహిస్తున్న భారత హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్‌ఇఎల్) సంస్థదే బాధ్యత అని బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.. బీటీపీఎస్‌లో చేపడుతున్న రోడ్లు, భవనాల నిర్మాణ పనులకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్, ఇతర సామగ్రి అంతా బీహెచ్‌ఈఎల్ వారు సమకూర్చుతున్నారని, వీటికి బీటీపీఎస్‌కు, జెన్‌కో సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బీటీపీఎస్‌లో జరుగుతున్న నిర్మాణ పనులపై సాక్షిలో ప్రచురితమైన 'అవినీతి బంధం – బీటీపీఎస్ కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు' శీర్షికన ప్రచురితమైన కథనానికి బీటీపీఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. గృహ నిర్మాణ పనులు కూడా బీటీపీఎస్, జెన్‌కో సంస్థకు సంబంధం లేదని వివరించారు.

ట్రాక్టర్ నడిపి వైద్యసిబ్బందిని తరలించిన సర్పంచ్

బూసురాయిలో వైద్యశిబిరం



ట్రాక్టర్‌లో బూసురాయి వెళ్తున్న వైద్య సిబ్బంది

గుండాల: మండలంలోని అత్యంత మారుమూల ప్రాంతమైన బూసురాయికి వెళ్లాలంటే ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు లేదా కాలినడకనే వెళ్లాలి. శుక్రవారం ఆ గ్రామానికి ఆళ్లపల్లి వైద్య సిబ్బంది ట్రాక్టర్‌లో వెళ్లి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అయితే, ఆ ట్రాక్టర్‌ను వెంకటాపురం సర్పంచ్ వజ్జా నర్సింహారావు స్వయంగా నడిపి వైద్యసిబ్బందిని గ్రామానికి చేర్చారు. అనంతరం వైద్యసిబ్బంది గ్రామంలోని గొత్తికోయలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. 37 కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైతే నాటుమందులు వాడకుండా ఆళ్లపల్లి లేదా పాల్వంచ ఆస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో హరికృష్ణ, జేత్రామ్, రమేశ్, పి.సత్యం, చైతన్య, పార్వతి, శ్రీధర్, సుగుణ, దేవకుమారి, మౌనిక, విశ్వనాథం, రాంమూర్తి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి



రంజిత్, శ్రీనివాసరావు(ఫైల్)

అశ్వాపురం: మండలంలోని చింతిర్యాలకాలనీ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు డెంగీ జ్వరంతో బాధపడుతుతూ శుక్రవారం మృతిచెందారు. ఒకే రోజు ఇద్దరు మృతిచెందటంతో గ్రామంలో విషాదం నెలకొనడంతోపాటు భయాందోళన వ్యక్తమవుతోంది. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం, ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు..

డెంగీ జ్వరంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన మండల ఉపాధ్యక్షుడు ఎన్నా రంజిత్ (34) శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. రంజిత్‌కు ఐదు రోజుల కిందట జ్వరం రాగా భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం హైదరాబాద్ తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో రంజిత్ మృతదేహాన్ని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, గద్దల రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు రంజిత్ మృతదేహానికి నివాళులర్పించారు. కాగా, అదే గ్రామానికి నిమ్మల శ్రీనివాసరావు (43) శుక్రవారం డెంగీ జ్వరంతో మృతి చెందాడు. వారం రోజులుగా శ్రీనివాసరావు జ్వరంతో బాధపడుతుండగా మణుగూరు ఆస్పత్రిలో చేరాడు. గురువారం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

బిర్యానీ, పెరుగులో పురుగులు



రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న వినియోగదారులు

కొత్తగూడెంటౌన్: ఆకలితో ఉన్న వారు రెస్టారెంట్‌కు వెళ్తే బిర్యానీతో పాటు పెరుగు పురుగులు రావడంతో ఆందోళనకు దిగారు. టేకులపల్లికి చెందిన లక్ష్మణ్‌రావు, సురేశ్, రమేశ్ కొత్తగూడెంలోని ఆర్‌టీఓ కార్యాలయానికి వచ్చి పనిముగిశాక కొత్తగూడెం సెవెన్‌హిల్స్ ఏరియాలోని రెస్టారెంట్‌కు వెళ్లారు. ముగ్గురు బిర్యానీ తీసుకుని తినే క్రమాన బిర్యానీతో పాటు పెరుగులోనూ చిన్నచిన్న పురుగులు కనిపించడంతో సిబ్బందిని ప్రశ్నించారు. అయితే, వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో నిలదీశారు. పోలీసులు చేరుకుని వివరాలను సేకరించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి తనిఖీలు చేపట్టారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇల్లెందుకు చెందిన సయ్యద్ జానీపాషాకు పోక్సో కేసులో ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి (పోక్సో స్పెషల్ జడ్జి) ఎం.శ్యాంశ్రీ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఇల్లెందు కొత్తకాలనీకి చెందిన బాలిక 2019, ఆగస్టు 12న ఇంటి ముందు కూర్చుని ఉంది. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ జానీపాషా బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అమ్మాయి తండ్రి గమనించాడు. అతడిపై ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జడ్జి పదకొండు మంది సాక్షులను విచారించగా సయ్యద్ జానీపాషాపై నేరం రుజువుకావడంతో ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

జూలూరుపాడు: మండలానికి చెందిన బాలికను బెదిరించి, ఆమె మెడపై బ్లేడ్‌తో కోసే ప్రయత్నం చేసిన యువకుడిపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఎస్‌డీ షాహీనా కథనం ప్రకారం.. పడమటనర్సాపురానికి చెందిన బాలిక జూలూరుపాడు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బాలిక కళాశాలకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఎస్కే ఆరీఫ్ మార్గమధ్యలో అడ్డగించి తనతో రావాలని, లేకపోతే గతంలో దిగిన ఫొటోలను వైరల్ చేస్తానంటూ బెదిరించి బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని ఓ స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లాడు. లైంగికదాడి చేసేందుకు యత్నించడం బాలిక ప్రతిఘటించింది. దీంతోతో బ్లేడ్‌తో ఆమె మెడపై కోసే ప్రయత్నం చేయడంతో తప్పించుకునే క్రమంలో స్వల్పగాయమైంది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆరీఫ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మరో కేసు...

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు దాడికి పాల్పడిన ఘటనపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ షాహీనా కథనం ప్రకారం.. పడమటనర్సాపురానికి చెందిన బాలిక జూలూరుపాడుతో ఇంటర్ చదువుతోంది. ఆమె ఈ నెల 9న కళాశాలకు ఆటోలో వస్తుండగా సాయిరాంతండా వద్ద అదే గ్రామానికి చెందిన ఎస్కే లతీఫ్‌పాషా అడ్డగించి తనతో రాకపోతే చంపుతానని బెదిరించి తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. బాలిక కేకలు వేయడంతో వినోభానగర్ సమీపంలో దించి, ఎవరికైనా చెపితే ఆమెతోపాటు తల్లిదండ్రులను చంపుతానని బెదిరించి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షాహీనా పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సంతోష్ మృతదేహం

పాల్వంచ: విద్యుదాఘాతానికి గురై శుక్రవారం ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం.. పట్టణంలోని శేఖరంబంజర గ్రామానికి చెందిన బాదావత్ రమేశ్ అతని కుమారుడు సంతోష్ (20) కలిసి గట్టాయిగూడెంలో మేకల శోభన్‌బాబు ఇంటి వద్ద చిప్పింగ్ వర్క్‌కు వెళ్లారు. పనిచేస్తున్న క్రమంలో సంతోష్ కరెంట్ కనెక్షన్ ఆపివేసేందుకు వెళ్లి వైర్ పట్టుకుని ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని తోటి వర్కర్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ...

టేకులపల్లి: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఏ-కాలనీతండాకు చెందిన చెందిన ధరావత్ శంకర్ (48) సూరారం ఆశ్రమ పాఠశాలలో డైలీవేజ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 8న పురుగులమందు తాగగా కుటుంబసభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, కుమార్తె మౌనిక ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో భార్యను నరికాడు..

ఆవేశంలో కొడవలితో మెడపై వేటు



వెంకటలక్ష్మి (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: మద్యానికి బానిసైన వ్యక్తి.. భార్యతో గొడవ పడుతూ ఆవేశంతో ఆమెపై కొడవలితో దాడి చేసి హతమార్చాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం మల్లాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి తాటి నాగులగూడెంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మొడియం పాపారావు – వెంకటలక్ష్మి(45)కి ఇద్దరు కుమార్తెలుండగా వివాహాలు జరిగాయి. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన పాపారావు గురువారం అర్ధరాత్రి దాటాక భార్యతో మత్తులో గొడవపడ్డాడు. మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోని విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా ఆయన వెంకటలక్ష్మిని కర్రతో కొట్టాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయగా ఇరుగుపొరుగు వచ్చి పాపారావును అడ్డుకునేందుకు యత్నించారు. అయినా సరే పాపారావు ఆగకపోగా, 'నా భార్యను కొడతా, తిడతా.. మీకెందుకు'అనడంతో రోజూ జరిగే గొడవే కదా అని వారు వెళ్లిపోయారు.

తలుపు వేసి, కొడవలితో దాడి చేసి..

ఇరుగుపొరుగు వెళ్లాక ఇంటి తలుపులు వేసిన పాపారావు మరోసారి భార్యతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే ఇంట్లో ఉన్న కొడవలితో తలపై మోది, తల, ముఖంపై దాడి చేయగా తీవ్ర రక్తస్రావమై మృతి చెందింది. శుక్రవారం ఉదయం కూలీ పనులకు పిలిచేందుకు స్థానిక మహిళలు వెళ్లగా ఆమె రక్తపు మడుగులో కనిపించడంతో పోలీసులకు తెలిపారు. సీఐ కరుణాకర్, ఎస్‌ఐ పి.శ్రీకాంత్ చేరుకుని కొడవలితో విచక్షణారహితంగా దాడి చేయడంతోనే రక్తస్రావమై ఆమె మృతి చెంది ఉంటుందనే నిర్ధారణకు వచ్చారు. కాగా, పరారీలో ఉన్న పాపారావు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధి నిర్వహణలో లైన్‌మెన్‌కు గుండెపోటు

ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి



రమేశ్ మృతదేహం

బూర్గంపాడు: విధి నిర్వహణలో గుండెపోటు వచ్చి విద్యుత్‌శాఖ లైన్‌మెన్ మృతిచెందిన ఘటన శుక్రవారం బూర్గంపాడులో చోటుచేసుకుంది. బూర్గంపాడులో విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చిర్రా రమేశ్ (42) వ్యవసాయ విద్యుత్ లైన్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్నాడు. ఛాతిలో నొప్పిగా ఉందని తన సహాయకులకు చెప్పి బూర్గంపాడులోని సబ్‌స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ తోటి ఉద్యోగులు అతడిని గమనించి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు భద్రాచలం తరలించారు. అక్కడి వైద్యులు అతడిని పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భద్రాచలంలో లైన్‌మెన్‌గా పనిచేసిన రమేశ్ ఇటీవలనే బూర్గంపాడుకు బదిలీపై వచ్చాడు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రమేశ్ ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేశ్ మృతదేహాన్ని డీఈ జీవన్‌కుమార్, ఏడీఈ వేణు, ఏఈ ఉమారావు, తోటి ఉద్యోగులు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఇక ట్రెజరీ జీతాలు!

బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర పడితే ఈ నెల నుంచే..

- ఏదైనా జాప్యం జరిగితే వచ్చే నెల నుంచి అమలు
- ఉద్యోగుల హోదాలు, వేతనాల వివరాలను సిద్ధం చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు
- అయోమయానికి తావు లేకుండా కొన్నిరోజులు బదిలీలు, పదోన్నతులపై ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులకు ప్రభుత్వ ట్రెజరీ నుంచి జీతాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కుదిరితే ఈ నెల నుంచే ప్రభుత్వ జీతాలు అందేలా ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. దీనికి గవర్నర్ ఆమోదముద్ర పడగానే చట్టబద్ధత రానుంది. ఈ క్రమంలో అటు గవర్నర్ ఆమోద ముద్ర కోసం ఎదురుచూస్తూనే.. ఇదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వం నుంచే జీతాలు విడుదలయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ తాజాగా ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని కోరింది. దీంతో.. ఉద్యోగి పేరు, హోదా (డెజిగ్నేషన్), పనిచేస్తున్న విభాగం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం అందుకుంటున్న జీతం వివరాలను ఆధార సహితంగా జాబితా రూపంలో ఆర్టీసీ సిద్ధం చేస్తోంది.

ఈ నెల 16 తర్వాత బదిలీలు వద్దు

ఉద్యోగులు, జీతాల జాబితాలను ఆయా విభాగాధిపతులు సిద్ధం చేసి బస్‌భవన్‌కు పంపితే, అక్కడి నుంచి ఆర్థిక శాఖకు చేరనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది ఎక్కడివారు అక్కడే ఉంటే జాబితాలో అయోమయం లేకుండా ఉంటుందన్న ఉద్దేశంతో.. ఆర్టీసీలో ఈనెల 16వ తేదీ తర్వాత బదిలీలు, పదోన్నతులకు వీలు లేకుండా ఆదేశాలు వెలువడ్డాయి. పదోన్నతులు, బదిలీల వంటివి ఆలోగానే పూర్తి చేయాల్సి ఉంటుంది. 16వ తేదీ తర్వాత ఉద్యోగుల వివరాలను సిద్ధం చేసి, ఆర్థిక శాఖకు పంపనున్నారు. ఈ మేరకు ఆర్థికశాఖ జీతాల పద్దును సిద్ధంచేసి ట్రెజరీకి పంపుతుంది. ఆలోగా ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం వస్తే.. ప్రస్తుత నెల జీతాలను ట్రెజరీ నుంచి విడుదల చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ఒకవేళ జాప్యం జరిగితే.. ఈ నెలకు ఆర్టీసీ నుంచే జీతాలిచ్చి, వచ్చే నెల నుంచి ట్రెజరీ ద్వారా విడుదల చేసే అవకాశం ఉంటుంది.

కొంతకాలం ప్రస్తుత వేతనాలే..!

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైనా కొంతకాలం ప్రస్తుతమున్న వేతనాలే అందనున్నాయి. ఎందుకంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోని వివిధ హోదాలు, కేడర్లకు సమానంగా నిర్ధారించాల్సి ఉంటుంది. అప్పుడు ఆయా కేడర్లను బట్టి వేతనాల్లో మార్పులు చేర్పులు జరుగుతాయి. త్వం"లో ప్రభుత్వం నియమించనున్న అధికారుల సబ్ కమిటీ దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించాల్సి ఉంటుంది. సదరు కమిటీ ఏర్పాటై, వివరాలు కోరగానే అందజేసేందుకు వీలుగా.. ఆర్టీసీ ఉన్నతాధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఏపీలో ఇంతకుముందే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనంచేసిన నేపథ్యంలో.. అక్కడ అనుసరించిన పద్ధతులు, ఎదురైన ఇబ్బందులు, వాటి పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించేందుకు ఇటీవలే టీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు విజయవాడ వెళ్లి వచ్చారు. తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు కూడా విజయవాడ వెళ్లి అధ్యయనం చేసి వస్తున్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు

- మరో పది మందిపై కూడా..
- ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌లో నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు చర్యలు



మహబూబ్‌నగర్ క్రైం/సాక్షి, హైదరాబాద్: నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మరో పదిమందిపై కేసులు నమోదయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అఫిడవిట్ ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలలోగా కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. నేడు రెండవ శనివారం, 13న ఆదివారం సెలవు ఉండటంతో 14న కోర్టుకు కేసుకు సంబంధించిన నివేదిక ఇవ్వడానికి పోలీసులు సిద్ధమైనట్టు సమాచారం

ఇదీ కేసు..

ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌పై దాఖలైన కేసులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర, కేంద్ర రిటర్నింగ్ అధికారులపై కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. 2018, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌ను శ్రీనివాస్‌గౌడ్ ట్యాంపరింగ్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో దావా వేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి, మంత్రి సహా సదరు అధికారులపై కేసు నమోదు చేయాలని తీర్పునిచ్చారు.

కేసు నమోదైంది వీరిపైనే..

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అప్పటి అధికారులు, ప్రస్తుత ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా అండర్ సెక్రటేరియల్ రాజీవ్‌కుమార్, సంజయ్‌కుమార్, రాష్ట్ర ఎన్నికల అధికారి శశాంక్‌గోయల్, సెక్రెటరీ, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, కలెక్టర్ వెంకట్రావు, డిప్యూటీ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ శ్రీనివాసులు, టెక్నికల్ అధికారి వెంకటేష్‌గౌడ్, విశ్రాంత ఉద్యోగి సుధాకర్, న్యాయవాది రాజేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదైనట్టు సమాచారం.

గిట్టనివారి అంతు చూస్తారట!

- ఇందుకోసమే వారికి అధికారం ఇవ్వాలట..
- బాబు, అతని దత్తపుత్రుడు, సొంత పుత్రుడిపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్

75 ఏళ్ల ముసలాయన, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు మాట్లాడుతున్న మాటలు వినండి. అధికారం ఇస్తే ఏం చేస్తారో వీళ్ల నోటితో వీళ్లే చెప్పారు. తనకు అధికారం ఇస్తే ఎవరినీ వదలడట.. తనకు గిట్టని వారి అంతు చూస్తాడట.. మట్టుబెడతాడట.. ఉగ్రరూపం చూపిస్తాడట.. ఏకంగా నరకం చూపిస్తాడట.. ఇందు కోసం ఆయనకు అధికారం ఇవ్వాలట! ఇదీ ఈ పెద్దమనిషి నైజం. ఇలాంటి ఆయన కోసం ఆయన దత్తపుత్రుడు పరుగెడుతున్నాడు. ఈ పెద్దమనిషికి ఏనాడైనా ప్రజలకు మంచి చేసిన చరిత్ర ఉందా? ఫలానా పని చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేకే రెచ్చగొట్టి గొడవలు సృష్టించి లబ్ధిం గడుపుకోవాలని చూస్తున్నారు. ఇదేం రాజకీయం? – సీఎం వైఎస్ జగన్



సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: 'చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఎక్కడా చెప్పడం లేదు. అలా చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అందుకే గొడవలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారు. యాత్రలు, సభల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అమలాపురంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈ రోజు నిజంగా వీళ్లందరి ఆలోచన ఏ స్థాయిలో ఉందో ప్రజలు గమనించాలని కోరారు. 'వారు మంచి చేస్తామంటే ప్రజలు నమ్మరని వాళ్లకు తెలుసు. కాబట్టే ప్రజల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. అబద్ధాలు చెబుతున్నారు. ప్రతి రోజూ మోసాలు చేస్తారు. మీటింగులు పెట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. చివరకు 47 మంది పోలీసులపై దాడి చేశారు. ఇలాంటి రాక్షసులకు ఎందుకు సెక్యూరిటీ ఇవ్వాలని అనిపించింది. ఎక్కడికక్కడ ప్రజల్ని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్న వారి పట్ల మనమంతా చాలా జాగ్రత్తగా ఉండాలి' అని సూచించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

శవ రాజకీయాలు చేస్తున్నారు.

- మొన్న అంగళ్లలో చంద్రబాబు తానే స్వయంగా రెచ్చగొట్టి గొడవలు చేయించారు. మళ్లీ పుంగనూరులో ఒక రూటుకు అనుమతి తీసుకొని ఆ రూట్లో పోకుండా పుంగనూరుకు వచ్చి వేరే రూట్లో పోవాలని ప్రయత్నించారు. అప్పుడే పోలీసులు మీకు అనుమతి లేదని.. అక్కడ అధికార పార్టీ వాళ్లు నిరసన కార్యక్రమం చేసుకుంటున్నారు.. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తుందని చెప్పారు.
- దీంతో చంద్రబాబు వారిని ఇష్టమొచ్చినట్లు తిట్టాడు. వాళ్ల క్యాడర్‌ను రెచ్చగొట్టి 47 మంది పోలీసులను గాయపరిచారు. ఒక పోలీసు సోదరుడికి కన్ను కూడా పోగొట్టాడు. కారణం గొడవలు జరగాలి. శవ రాజకీయాలు చేయాలన్నదే ఆలోచన. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వాళ్లదే. వాళ్లు ఏం చెబితే అది రాస్తారు. మైకులు పట్టుకొని దత్తపుత్రుడు రెడీగా ఉన్నాడు

నోరు తెరిస్తే అబద్ధాలే

- 2014కు ముందు ఈయన మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకోండి. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలి అన్నారు. రైతుల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే బాబు రావాలంటూ మోసం చేశాడు. రూ.85,712 కోట్ల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి, చేయకుండా రైతులను నిలువునా మోసం చేశాడు.
- రూ.14,207 కోట్ల పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశాడు. చివరకు చదువుకుంటున్న పిల్లలనూ వదల్లేదు. ఉద్యోగం ఇస్తాను లేదా ఉపాధి కల్పిస్తాను అని నిస్సిగ్గుగా అబద్ధాల వాగ్దానాలు చేశాడు. లేదంటే ఇంటింటికీ రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ప్రతి ఇంటికీ రూ.2 వేలు అంటే ప్రతి పిల్లాడికీ ఏటా రూ.24 వేలు అలా ఐదేళ్లలో రూ.లక్షా 20 వేలు మోసం చేశాడు.

నాడు, నేడు అదే బడ్జెట్..

- చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం. అప్పులు కూడా అప్పటికన్నా ఇప్పుడే తక్కువ. కేవలం సీఎంమారాడు. మీ బిడ్డకు ఓటు వేయకపోయినా ఫర్వాలేదు..కచ్చితంగా వారికి రావాల్సినవి రా వాలని ప్రయత్నం చేశాడు. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు.. అప్పట్లో ఇదే చంద్ర బాబు ఎందుకు చేయలేకపోయాడని ఆలోచించండి.
- మీ బిడ్డ మీ కోసం ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా రూ.2.31 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి మీ అకౌంట్లలోకి పంపించాడు. ఈ నాలుగేళ్లలో ఇంతటి సంక్షేమాభివృద్ధిని ఏనాడైనా చూశామా? చంద్రబాబు హయాంలో సామాజిక న్యాయం ఉందా? నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా ఇన్ని పదవులు ఏనాడైనా ఇచ్చారా? ఏనాడైనా మీ బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచన చేశాడా? చివరకు పేదింటి పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదవాలంటే కూడా వద్దన్న చరిత్ర ఆయనది.
- చంద్రబాబు అధికారంలో ఉండగా ఇలా 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి.. ఇళ్లు కట్టించడం ఎప్పుడైనా చేశారా? ఇలా చేయలేకపోయిన ఈ 75 ఏళ్ల ముసలాయన వాటిని అడ్డుకోవడంలో మాత్రం ముందుంటారు. దత్తపుత్రులు ఎందుకిలా పరుగెడుతున్నాడంటే ఆయన సీఎం కావడానికి కాదట. ఈ ముసలాయన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టడానికట. ఇలాంటి వ్యక్తి సీఎం అయితే మనకు మంచి జరుగుతుందా?
- మీకు మంచి చేయడానికి వస్తున్న వలంటీర్లను కూడా వదలకుండా ఎంత దారుణంగా మాట్లాడారు. రాబోయే రోజుల్లో వీళ్ల నీచ రాజకీయాలు, అబద్ధాలు ఇంకా ఎక్కువ అవుతాయి. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తామని చెబుతారు. నాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడు అండగా లేరు. మీ బిడ్డ నమ్ముకున్నది దేవుడి దయ, మీ దీవెనలనే. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మాత్రం మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి.

భావితరాల కోసం నీటి వనరులను కాపాడండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భావితరాల వారి కోసం నీటివనరులను కాపాడాల్సిన అవసరం ఉందని, లేదంటే వారు క్షమించరని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని ప్రతిసారి చెబుతున్నా పట్టనట్లు వ్యవహరించడం సహించరానిదని వ్యాఖ్యానించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్లపై అఫిడవిట్ అందజేయాలని ఆదేశించింది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్లు ఏర్పాటు చేయాలని, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను నిర్ధారించాలని గతంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించినా నివేదిక అందజేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. చెరువుల బఫర్ జోన్లను గుర్తించారా?, హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు ఎన్ని? అని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ తరఫు న్యాయవాది స్పందిస్తూ హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3,532 సరస్సులు ఉన్నాయని, 239 సరస్సులకు బఫర్ జోన్లు గుర్తించామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. అఫిడవిట్ వేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.

కేసులో కావాలనే ఇరికించారు.. బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో తమను సీబీఐ కావాలనే ఇరికించిందని, తమకు బెయిల్ ఇవ్వాలని వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సీబీఐ కోర్టు తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యకేసులో దర్యాప్తు పూర్తయిందని, సీబీఐ అభియోగ పత్రాన్ని కూడా దాఖలు చేసిందని తెలిపారు. ఈ కేసులో పిటిషనర్లను అక్రమంగా ఇరికించారని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు కోర్టుకు సమర్పించలేదన్నారు. ఇప్పటికే 5 నెలలకు పైగా జైలులో ఉన్నారని, భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని చెప్పారు. పలుమార్లు జైలు అధికారులు ఆస్పత్రుల్లో భాస్కర్‌రెడ్డికి పరీక్షలు కూడా నిర్వహించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది.

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద షాపులకు వేలం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం –జగన్నాధపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన 12 షాపులను మూడేళ్లపాటు అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 18న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. అలాగే, కొబ్బరిచిప్పలు, భక్తులు సమర్పించే చీరలను పోగు చేసుకునేందుకు ఏడాది కాలానికి లైసెన్స్ కల్పించేందుకు కూడా వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 18న ఉదయం 10గంటల వరకు రూ.200 చెల్లించి షెడ్యూల్ తీసుకోవచ్చని, ధరవత్‌ను నగదు రూపంలో కానీ డీడీ రూపంలో కానీ చెల్లించాలని సూచించారు.

రామయ్య సన్నిధిలో ఎమ్మెల్సీ



ఆలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారిని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న ఆయనకు పండితులు వేదాశీర్వచనం అందించగా అలయ అధికారులు ప్రసాదం, జ్ఞాపిక బహూకరించారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన మారం నాగిరెడ్డి – రాజేశ్వరి దంపతులు దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.50,016ను విరాళంగా అందజేశారు.

నేటి నుంచి పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు

ఇల్లెందు: పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. అందుకోసం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. ఈ తరగతులకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ ఎస్.ఆజాద్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు తదితరులు హాజరుకానున్నారని నాయకులు తెలిపారు.

పోటీల్లో పాల్గొందాం... రండి!

- తపాలా శాఖ ఆధ్వర్యాన వ్యాసరచన పోటీలు
- 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అంశంపై నిర్వహణ
- అక్టోబర్ 31వ తేదీ వరకు అవకాశం



ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల నిర్వహణకు నిర్ణయించారు. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అంశంపై పోటీలు జరగనున్నాయి. రెండు కేటగిరీల్లో ఈ పోటీలను నిర్వహించనుండగా, 18 ఏళ్ల లోపు వారు ఒక కేటగిరీ, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరీగా నిర్ధారించారు.

ఎలా పాల్గొనాలి?

పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు ఏ–4 సైజు పేపర్‌లో వెయ్యి పదాలతో వ్యాసం రాసి పంపించాలి. లేదా ఇన్‌లాండ్ లెటర్‌లో 500 పదాల్లో కూడా రాసి పంపించొచ్చు. అక్టోబర్ 31వ తేదీలోగా చేరేలా 'ది చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్' చిరునామాకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, వెర్నాక్యులార్ భాషల్లో రాసి పోస్ట్ బాక్స్‌లో వేయాలి. లేదంటే పోస్టాఫీసుల్లో ఇచ్చినా తీసుకుంటారు. అయితే, అక్టోబర్ 31వ తేదీ తర్వాత అందే లెటర్లను పరిగణనలోకి తీసుకోమని అధికారులు వెల్లడించారు.

'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తుండగా, డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, ఆర్థికం, సేవలు, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలను పొందుపర్చాలని సూచించారు.

సర్కిల్, జాతీయ స్థాయిలో బహుమతులు

పోటీల్లో విజేతలకు కేటగిరీల వారీగా నగదు బహుమతులు అందించనున్నారు. పోస్టల్ సర్కిల్ స్థాయిలో, జాతీయ స్థాయిలో నగదు బహుమతులు ప్రకటించారు. ఒక్కో కేటగిరీలో మూడు బహుమతులు ఇస్తారు. తెలంగాణ పోస్టల్ సర్కిల్ స్థాయిలో వరుసగా రూ.25వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున ముగ్గురికి అందజేస్తారు. అలాగే, జాతీయ స్థాయిలో రూ.50వేలు, రూ.25వేలు, రూ.10వేల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలి..



రెండు కేటగిరీల్లో జరిగే పోటీల్లో సర్కిల్ స్థాయి, జాతీయ తపాలా స్థాయిలో నగదు బహుమతులు ఉంటాయి. ఆసక్తి కలిగిన వారు ఎక్కువ మంది వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలి. ఖమ్మం డివిజన్ నుంచి ఎక్కువ మంది పాల్గొని బహుమతులు గెలుచుకునేలా అవకాశం కల్పిస్తాం.

– బి.రవికుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

జేకేఓసీ నిర్వాసిత జాబితాలో అక్రమాలు

- 'సాక్షి' వరుస కథనాలతో కదిలిన అధికారులు
- ఫారెస్ట్ బీట్ అధికారి చందులాల్ సస్పెన్షన్



సీఎస్పీబస్తీ గ్రామపంచాయతీ పరిధిలోని జేకేఓసీ నిర్వాసిత ప్రాంతం

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకేఓసీ నిర్వాసిత జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలు ఎట్టకేలకు వెలుగులోకి వచ్చాయి. భూమిలేని వారి పేర్లు జాబితాలో చేరడం, భూకమతాలు పెరగడంపై .. మే 29వ తేదీన 'పెరుగుతున్న నిర్వాసితుల జాబితా', జూన్ 1వ తేదీన 'తవ్వినకొద్ది వెలుగులోకి అక్రమాలు' శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కాగా మేల్కొన్న అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా వెల్లడైన వివరాలిలా ఉన్నాయి.

అటవీ ప్రాంతమే ఎక్కువ

జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతం అత్యధికంగా అటవీశాఖ ఆధీనంలో ఉంది. అయితే, ఆ భూభాగంలో కొందరు దశాబ్దాల కాలంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే సాగు చేసుకుంటున్న రైతులకు నష్టం కలగకూడదన్న నిబంధనలకు లోబడి సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సాగులో ఉన్న ప్రతీ రైతుకు నిర్వాసిత ప్యాకేజీ ఇస్తామని గ్రామసభలో ప్రకటించాక రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే ప్రారంభించారు. ఇక్కడి నుంచే అక్రమాలకు పునాదులు పడ్డాయి. చెప్పాలి. అటవీశాఖలో సర్వేయర్‌గా నైపుణ్యం ఉన్న ధర్మాపురం బీట్ అధికారి చందులాల్‌కు నిర్వాసిత ప్రాంతంలో సర్వే బాధ్యత అప్పగించారు. అయితే నిర్వాసితుల ప్రాంతంలో భూకమతాలు పెంచడం, కనీసం భూమిలేని వారి పేర్లను కూడా నిర్వాసిత జాబితాలో చేర్చాడన్న ఆరోపణలు వచ్చాయి. ఇంతలోనే 'సాక్షి'లో కథనాలు రావడంతో విచారణ నిర్వహించిన అటవీశాఖ అధికారులు అక్రమాలు నిజమేనని నిర్ధారించారు. ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు ఇచ్చిన నివేదిక, డీఎఫ్ఓ కృష్ణగౌడ్ ఆదేశాల మేరకు బీట్ అధికారి చందులాల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఎఫ్‌డీఓ కె.వెంకన్న శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖలో ఎవరు అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అడవి నరికినా, కలప అక్రమంగా తరలించే వారికి సహకరించినట్లుగా తేలితే అటవీశాఖ సిబ్బందిపై చర్యలు తప్పవని తెలిపారు.

న్యాక్-ఏ ప్లస్, ప్లస్ గ్రేడ్‌పై అభినందనలు



కళాశాల బృందాన్ని అభినందిస్తున్న వాకాటి కరుణ

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు ఇటీవల న్యాక్-ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఏఆర్ సత్యవతి తదితరులు హైదరాబాద్‌లో శుక్రవారం ఉన్నత విద్య కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, పూర్వ కమిషనర్ నవీన్‌మిత్తల్‌ను కలవగా వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలకు ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ లభించటం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాల విద్య కమిషనరేట్ జేడీ రాజేందర్‌సింగ్, ఆర్‌జేడీ యాదగిరి, చారి తదితరులను కూడా కలిశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ శ్రీనివాసులు, అనురాధ, సునంద, డాక్టర్ ఎస్ రమేష్, సురేశ్‌బాబు, ఎం.సుబ్రహ్మణ్యం, జీవన్‌కుమార్, గోపి, కేయూ ఈసీ సభ్యుడు డాక్టర్ సీతారాం పాల్గొన్నారు.

ప్రమాదరహితంగా వర్క్‌షాప్ నిర్వహణ

డంపర్ బేస్ షెడ్‌ను ప్రారంభించిన డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



కోల్ రిసీవింగ్ సెంటర్‌లో పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

సత్తుపల్లిరూరల్: ఎంతో వ్యయంతో నిర్మించిన బేస్ వర్క్‌షాప్‌లో ఒక్క ప్రమాదం జరగకుండా డంపర్ల నిర్వహణ సాగించాలని సింగరేణి డైరెక్టర్ (పీఅండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 60 టన్నుల కెపాసిటీ కలిగిన డంపర్ మెయింటనెన్స్ వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో రక్షణను కూడా అందే ప్రాధాన్యతగా భావించాలని తెలిపారు. అనంతరం కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్, జేవీఆర్ సీహెచ్‌పీలోని సెకండ్ సైజర్ ఏరియాను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఆ తర్వాత బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలపై ఆరా తీశారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు, అధికారులు, నాయకులు సీహెచ్ నవీన్‌కుమార్, వెంకటాచారి, రజాక్, ఎం.వీరయ్య, ఎం.శ్రీనివాస్, మనోహర్, మదీనాబాషా, డి.రమణారెడ్డి, కె.దేవదాస్, చెన్నకేశవరావు, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

14న సత్తుపల్లిలో మెగాజాబ్ మేళా..

- 30 కంపెనీలు, 500కుపైగా ఉద్యోగాలు
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే వెంకటవీరయ్య



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ప్రజాప్రతినిధులు

సత్తుపల్లి: నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 14న సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. శ్రీభారతి విద్యాసంస్థలు, సత్తుపల్లి మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యాన ఈమేళా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముప్పై కంపెనీల బాధ్యులు హాజరుకానుండగా, 500మందికి పైగా అవకాశం కల్పించనున్నారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు చదువుకున్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అరవిందో, టెక్ మహీంద్ర, టాటా, అపోలో, హెటిరో తదితర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధిరెడ్డి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఇప్పటికే హెటిరోడ్రగ్స్‌లో 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసుతో పాటు సతీష్, చల్లగుండ్ల కృష్ణయ్య, ఎస్.కే.రఫీ, మల్లూరు అంకమరాజు, మట్టా ప్రసాద్, మాధురి మధు, అద్దంకి అనిల్, దేవరపల్లి ప్రవీణ్, ఎస్.కే.చాంద్‌పాషా, ఎస్.కే.అబ్దుల్లా పాల్గొన్నారు.

ఫైలేరియా మాత్రల పంపిణీ పరిశీలన



విద్యార్థులతో డబ్ల్యూహెచ్‌ఓ బృందం

మధిర: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టిన మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(బోదకాలు వ్యాధి నివారణ మాత్రల పంపిణీ) కార్యక్రమాన్ని శుక్రవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) బాధ్యులు శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రకుమార్‌సింగ్, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ బృందం మధిర మండలంలోని దెందుకూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించి మాత్రల పంపిణీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. ప్రతిఒక్కరికీ వయస్సు ఆధారంగా మాత్రలు పంపిణీ చేసి, బోదకాలు వ్యాధి నివారణకు పాటుపడాలని సిబ్బందికి సూచించారు. అలాగే, మధిర బస్టాండ్ సెంటర్‌లో కూడా తనిఖీ చేశారు. వైద్యులు సురేశ్, పృథ్వీనాయక్, ఉద్యోగులు వినీల, పద్మావతి, మోక్షరాణి, కౌసల్య పాల్గొన్నారు.